సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం, 21, జూలై, 2025



అక్రమ అరెస్టులకు భయపడం

రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అక్రమ అరెస్ట్‌లకు భయపడబోమని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. 8లో



టమాట కిలో రూ.31

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.31 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.1°/21.6°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఓర్వలేకే అక్రమ అరెస్టులు

- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ ధ్వజం



పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ కూటమి ప్రభుత్వం ఓర్వలేకపోతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. కుట్రలు పన్ని పార్టీ నేతలను అక్రమంగా అరెస్టు చేయడం ద్వారా జగన్‌ను ఒంటరి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆమె ఆదివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ పర్యటనలకు ప్రజలు పోటెత్తుతుండటంతో కూటమి నేతల్లో భయం పట్టుకుందన్నారు. అందుకే కుట్రలు పన్ని ఓఎస్‌డీ కృష్ణమోహన్, ధనుంజయరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను అరెస్ట్ చేశారన్నారు. లేని మద్యం కుంభకోణాన్ని సృష్టించి అక్రమ అరెస్టులకు తెరలేపారన్నారు. గతంలో కూటమి నాయకులు ఒకసారి రూ.50 వేల కోట్ల కుంభకోణం అని, తర్వాత రూ.30 వేల కోట్లు అని, ఇప్పుడు రూ.18 వేల కోట్లు.. రూ.2 వేల కోట్ల స్కాం అని అంటున్నారని మండిపడ్డారు. తప్పుడు ఆరోపణలు, అక్రమ అరెస్టులను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. పొంతనలేని మాటలతో కూటమి నాయకులు ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. ఎటువంటి ఆధారాలూ లేకుండా అరెస్ట్‌లకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియంత్రణతో మద్యం అమ్మకాలు చేపట్టిందన్నారు. నేడు ప్రతి గల్లీలోనూ బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు చేస్తున్నారన్నారు. అసలైన విచారణ ఇప్పుడు ఈ ప్రభుత్వం మీద సిట్ అధికారులతో చేయించాలన్నారు. లేని మద్యం కుంభకోణం నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని స్పష్టం చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

పుట్టపర్తి టౌన్: ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పని సరిగా వెంట తీసుకురావాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పొగతాగిన ఐదుగురికి జరిమానా



సిగరెట్ తాగిన వారికి జరిమానా విధిస్తున్న సీఐ

హిందూపురం: స్థానిక రహమత్ సర్కిల్ వద్ద బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న ఐదుగురికి రెండో పట్టణ సీఐ అబ్దుల్ కరీం జరిమానా విధించారు. ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఒక్కొక్కరికి రూ.200 చొప్పున జరిమానా విధించారు. బహిరంగంగా పొగతాగడం, పాన్‌మసాలు తింటూ ఉమ్మి వేయడం వంటివి నిషేధమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ఖాళీ కనిపిస్తే కబ్జా

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గ కేంద్రంలో కబ్జాదారులు చెలరేగిపోతున్నారు. ఖాళీ స్థలం కనపడితే చాలు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. దీంతో పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ స్థలాలు రోజురోజుకూ అన్యాక్రాంతం అవుతున్నాయి.





సర్వే నంబర్ 650లో చదును చేసిన స్థలం ఓపెన్ సైట్‌గా చూపుతున్న స్కెచ్, సర్వే నంబర్ 650లో అగ్రికల్చర్ గోడౌన్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో వేసిన పునాదులు

ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం

- ధర్మవరం సమీపంలో చెరువు స్థలాన్నీ వదలని వైనం
- అగ్రికల్చర్ గోడౌన్ పక్కన ఓపెన్ సైట్‌లో ఏకంగా పునాదులు

ధర్మవరం: అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు కలిసివస్తోంది. అడిగేవారు లేరు కదా అని స్థలాలు ఆక్రమించేస్తున్నారు. ఆపై దర్జాగా నిర్మాణాలు చేపట్టడం.. లేదా ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారిపోయింది. ధర్మవరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు కూతవేటు దూరంలో ఉన్న స్పందన ఆస్పత్రి ఎదురుగా సర్వే నంబర్ 661లో రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. జేసీబీలతో చదును చేసి మట్టి తోలుతున్నారు. చెరువు స్థలంలో ఉన్న గుంతలు పూడ్చి ఎత్తు చేస్తున్నారు. ఈ సర్వే నంబర్‌లోని స్థలాన్ని గతంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చెడు వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రిజర్వ్ చేశారు. అయితే ఈమధ్య కాలంలో కొంతమంది పట్టాలు తీసుకొచ్చి స్థలాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బహిరంగ మార్కెట్‌లో ఈ స్థలం విలువ రూ.కోటికి పైగానే ఉంటుంది. ఈ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చూడాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.




సర్వే నంబర్ 661లోని చెరువుస్థలాన్ని జేసీబీలతో చదును చేస్తున్న దృశ్యం

- పట్టణంలోని సర్వే నంబర్ 650లో అగ్రికల్చర్ గోడౌన్ పక్కన పది సెంట్ల ఓపెన్ సైట్ ఉంది. వాస్తవానికి గోడౌన్ చుట్టూ లారీలు అన్‌లోడ్ చేసేందుకు వచ్చినప్పుడు ఇబ్బంది లేకుండా ఈ స్థలాన్ని రిజర్వ్ చేసి పెట్టారు. అయితే ఇటీవల కూటమిలోని ఓ పార్టీకి చెందిన నాయకులు ఆ స్థలాన్ని శుభ్రం చేసి ప్లాట్లుగా విభజించి పునాదులు వేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ స్థలం విలువ రూ.70 లక్షల దాకా ఉంటుంది. పునాదులు వేసుకుంటున్న వారి వద్ద ప్లాట్‌కు సంబంధించి ఎటువంటి ఆధారాలు లేనట్లు సమాచారం.

ఎవ్వరికీ పట్టాలు ఇవ్వలేదు

చెరువు స్థలం ఇరిగేషన్ అధికారుల పరిధిలోకి వస్తుంది. సర్వే నంబర్ 650లో అగ్రికల్చర్ గోడౌన్ పక్కన స్థలం ఆక్రమణ విషయం నా దృష్టికి రాలేదు. మేము ఎవ్వరికీ పట్టాలు మంజూరు చేయలేదు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– సురేష్‌బాబు, ఇన్‌చార్జ్ తహసీల్దార్



సర్వేనంబర్ 661లో చదును చేసిన ప్రాంతం చెరువుదేనని చూపుతున్న ఉపగ్రహ ఛాయా చిత్రం

18 మండలాల్లో వర్షం



ధర్మవరంలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జిల్లాలోని 18 మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. లేపాక్షి మండలంలో 19.2 మి.మీ., హిందూపురం మండలంలో 11.2, అమరాపురంలో 9.8, ఎన్పీ కుంటలో 7.4, గుడిబండలో 7.4, సోమందేపల్లిలో 7.4, బత్తలపల్లిలో 7.2, తాడిమర్రిలో 6.8, రొళ్లలో 6.2, తనకల్లులో 5.8, గాండ్లపెంటలో 5.4, తలుపులలో 5.2, మడకశిరలో 5.2, అగళిలో 4.6, పెనుకొండలో 4.4, కదిరిలో 2.4, ధర్మవరంలో 2.2, నల్లచెరువులో 2 మి.మీ వర్షపాతం నమోదైంది. దీంతో పాటు ఆదివారం సాయంత్రం ధర్మవరం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాల్లో జల్లులు కురిశాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. జిల్లాలో మరో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు.



గంటల మారెమ్మ కనుమ వద్ద నిలిచిన వర్షపునీరు

సాయి బోధనలతో స్వీయ పరివర్తన



సంగీత కచేరీ నిర్వహిస్తున్న సత్యసాయి యూత్



యువతకు సరిఫికెట్లు ప్రదానం చేస్తున్న సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి బోధనలు ఆచరించడం ద్వారా ప్రతి ఒక్కరూ స్వీయపరివర్తనతో పరిపూర్ణులు అవుతారని వక్తలు పేర్కొన్నారు. 'స్వీయ పరివర్తన కోసం యువత నాయకత్వం' పేరిట రెండు రోజులుగా ప్రశాంతి నిలయంలో జరుగుతున్న సదస్సు ఆదివారం ముగిసింది. సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. వేద పఠనంతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 18 దేశాలకు చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు. యువతలో స్వీయ పరివర్తన కోసం సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన కోర్సును పూర్తి చేసుకున్న యువ నాయకులు మలేషియాకు చెందిన విమల్ రాజ్, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన రిషా తదితరులు ప్రసంగించారు. సత్యసాయి బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలను ఆచరించడం ద్వారా మహనీయులుగా మారుతారన్నారు. అనంతరం యువత సంగీత కచేరీ నిర్వహించారు. తర్వాత సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తిలు కోర్సు పూర్తి చేసుకున్న యువతకు సరిఫికెట్‌లు ప్రదానం చేశారు.

పీఏబీఆర్‌లో తగ్గిన నీటి మట్టం



కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం)లో నీటి మట్టం తగ్గింది. జలాశయంలోకి ఇన్‌ఫ్లో పూర్తిగా పడిపోయింది. ఈ క్రమంలో ఆదివారం నాటికి జలాశయంలో 1.9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం వద్ద ఏర్పాటైన శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి, అనంతపురం, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు రోజూ సుమారు 55 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం లీకేజీ, నీటి ఆవిరి, ఇతరత్రా కలిపి 65 క్యూసెక్కుల చొప్పున నీరు వెళ్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

బది'లీలల'పై హైకోర్టుకు..

- కోర్టు మెట్లెక్కిన సచివాలయ ఉద్యోగులు
- కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం శూన్యం
- హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన అగ్రికల్చర్ అసిస్టెంట్లు
- స్టేటస్‌కో ఇచ్చిన ఉన్నత న్యాయస్థానం



తమకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌కు విన్నవించేందుకు వచ్చిన సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు (ఫైల్)

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ పాలనలో న్యాయం అందని ద్రాక్షగా మారింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు జిల్లా యంత్రాంగంపై స్వారీ చేస్తున్నారు. అధికారులు కూడా వారికి దాసోహమై... విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజాప్రతినిధుల సిఫారసులకు తలొగ్గి నిబంధనలకు తుంగలో తొక్కి నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ తప్పిదాలు చివరికి అధికారుల మెడకే చుట్టుకునే పరిస్థితి నెలకొంది. ఇటీవల నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల బది'లీలల్లో' సరిగ్గా ఇదే జరిగింది. బదిలీల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందంటూ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు హైకోర్టును ఆశ్రయించారు. ఇందులో రాష్ట్రస్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారులను బాధ్యులను చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

ఖాతరు చేయని వైనం..

వ్యవసాయ శాఖ పరిధిలోని సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియను గత నెల 28న అధికారులు నిర్వహించారు. ఈనెల ఒకటో తేదీన బదిలీల ఉత్తర్వులు జారీచేశారు. ప్రక్రియలో అధికారులు నియమ, నిబంధనలు పాటించకపోవడం ద్వారా తొలి ర్యాంకులో ఉన్న తమకు అన్యాయం జరిగిందని పలువురు ఆరోపించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ సుస్మితది ఉమ్మడి జిల్లాలో 5వ ర్యాంక్, శ్రీ సత్యసాయి జిల్లాలో 2వ ర్యాంక్. జనార్దన్‌కు ఉమ్మడి జిల్లాలో 6వ ర్యాంక్, శ్రీ సత్యసాయి జిల్లాలో 3వ ర్యాంక్. ఇక శిరీషకు పీహెచ్ కోటా అమలు కాలేదు. ఇలా అర్హులైన పలువురు బదిలీల్లో వారు పెట్టుకున్న ఆప్షన్ స్థానాలు ఖాళీగా ఉన్నా ఇవ్వకుండా తరువాతి ర్యాంక్ వాళ్లకు ఇచ్చారని ఆరోపించారు. ఒక్క అగ్రికల్చర్ అసిస్టెంట్ల విషయంలోనే కాదు... సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో ప్రజాప్రతినిధుల సిఫారసులకు అధికారులు పెద్దపీట వేసి నిబంధనలు తుంగలో తొక్కారనే ఆరోపణలు వచ్చినా ఖాతరు చేయలేదు.

కలెక్టర్‌ను కలిసినా అంతే...

బదిలీల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందని అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను బాధిత అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు ఈనెల 2న కలిసి ఆధారాలతో సహా వినతిపత్రం అందజేశారు. విచారణ చేస్తామని కలెక్టర్ చెప్పి పంపించారు. అటు తరువాత కూడా కలెక్టర్‌ను అగ్రికల్చర్ అసిస్టెంట్లు మూడు, నాలుగు దఫాలు కలిసి తమ గోడు చెప్పుకుని న్యాయం చేయాలని కోరారు. అయితే వారి గోడును ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. దీంతో న్యాయం కోసం 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు హైకోర్టును ఆశ్రయించారు.

అధికారులను బాధ్యుల్ని చేస్తూ...

బదిలీల ప్రక్రియలో తమకు జరిగిన అన్యాయానికి అధికారులను బాధ్యులను చేస్తూ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు కె.హరినాథ్‌రెడ్డి, హెచ్.జహీర్, జె.రేణుకా, ఎం.సుస్మిత, కె.జనార్దన్, వి.తరుణ్‌రెడ్డి, బి.శిరీష, కడపల రజిత, బీఏ సంధ్య, పి.నేత్ర, జి.సర్‌తాజ్ హైకోర్టులో రిట్ పిటిషన్ (17050 ఆఫ్ 2025) వేశారు. గ్రామ సచివాలయ, వార్డు సచివాలయ శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు 19 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లను బాధ్యులను చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు వేసిన రిట్ పిటిషన్‌పై హైకోర్టు ఇంటీరియం ఆర్డర్ ఆఫ్ స్టేటస్‌కో ఈనెల 16న ఇచ్చింది. ఆ రోజు నుంచి రెండు వారాల పాటు స్టేటస్‌కో కొనసాగించాలని అధికారులను ఆదేశించడం గమనార్హం.

నేరాల నియంత్రణ ఎలా..?



ఇది అగళి పోలీస్ స్టేషన్. నియోజకవర్గ కేంద్రం మడకశిరకు 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. కర్ణాటక సరిహద్దుకు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ స్టేషన్ పరిధిలో అంతర్రాష్ట్ర నేరాలు నమోదవుతుంటాయి. ఇందుకు ప్రధాన కారణం ఇక్కడి పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరతే. 21 మంది కానిస్టేబుళ్లకు గాను ఐదుగురు మాత్రమే ఉన్నారు. 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక రెండు హెడ్ కానిస్టేబుళ్ల పోస్టులకు గాను

- హోం మంత్రి అనితకు 'సమస్యల హారం'
- కర్ణాటక సరిహద్దు స్టేషన్లలో పోలీసుల కొరత
- మిస్టరీగానే మిగిలిపోతున్న అంతర్రాష్ట్ర నేరాల కేసులు
- పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితం
- శిథిల దశలో పోలీసుల నివాస గృహాలు

మడకశిర: అంతర్రాష్ట్ర నేరాలు అధికంగా నమోదవుతున్న మడకశిర నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరత అధికంగా ఉంది. గుర్తు తెలియని మృతదేహాలకు సంబంధించి నమోదైన కేసుల్లో కొన్నింటిని మాత్రమే పోలీసులు ఛేదించారు. చాలా కేసులు మిస్టరీగానే మిగిలిపోయాయి. మడకశిర అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌తో పాటు రూరల్ సర్కిల్ పరిధిలోని అగళి, రొళ్ల, అమరాపురం, అగళి స్టేషన్ల పరిధిలో కానిస్టేబుళ్ల కొరత తీవ్రంగా ఉంది. 105 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా సగం స్థానాలు ఖాళీగా ఉన్నాయి. 20 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు 10 మంది మాత్రమే ఉన్నారు. చాలామంది కానిస్టేబుళ్లు డిప్యుటేషన్‌పై ఇతర పోలీస్‌స్టేషన్లకు కూడా వెళ్లారు.

సబ్‌డివిజన్ ఏర్పాటుపై నిర్లక్ష్యం..

మడకశిర కేంద్రంగా పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంతలోనే ప్రభుత్వం మారింది. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సబ్ డివిజన్ ఏర్పాటుపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో సబ్‌డివిజన్ ఏర్పాటు ప్రక్రియ ప్రతిపాదనలకే పరిమితమైపోయింది. రూరల్ పోలీస్ సర్కిల్ ఏర్పాటైనా కార్యాలయం మాత్రం మడకశిరలోనే కొనసాగుతోంది. ఈ సర్కిల్ పరిధిలోని అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల ప్రజలు ఏదైనా పనిమీద సీఐని కలవలంటే మడకశిరకే రావాల్సిన పరిస్థితి నెలకొంది.



మడకశిరలో శిథిలావస్థలో ఉన్న పోలీస్ నివాస గృహాలు

కండీషన్ లేని వాహనాలతో తంటాలు..

ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక వాహనం ఉండాలి. అయితే గుడిబండ పోలీస్‌స్టేషన్‌కు వాహన సౌకర్యం లేదు. ఈ వాహనం కండీషన్ లేకపోవడంతో ఉన్నతాధికారులు తీసుకెళ్లారు. మళ్లీ కొత్త వాహనాన్ని కేటాయించలేదు. ప్రస్తుతం గుడిబండ పోలీస్‌స్టేషన్‌కు వాహనం లేకపోవడంతో విధులు నిర్వర్తించడానికి పోలీసులు ఇబ్బందులు పడుతున్నారు. మిగిలిన పోలీస్‌స్టేషన్లకు కేటాయించిన వాహనాలు కూడా కండీషన్‌లో లేకపోవడంతో పోలీసులు తంటాలు పడుతున్నారు.

శిథిలావస్థలో పోలీస్ గృహాలు..

మడకశిరలో పోలీస్ నివాస గృహాలు శిథిల దశకు చేరుకున్నాయి. వర్షం వస్తే కారుతున్నాయి. అమరాపురంలో ఉన్న పోలీస్ నివాస గృహాలను కూలదోశారు. వాటి స్థానంలో కొత్త గృహాలను నిర్మించలేదు. అగళి, రొళ్ల, గుడిబండలో పోలీస్ నివాస గృహాలు లేవు. అద్దె ఇళ్లల్లో ఉంటున్నారు.

హోం మంత్రి దృష్టి సారించేరా?

రాష్ట్ర హోం మంత్రి అనిత సోమవారం మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. తమ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరిస్తారేమోనని పోలీసులు ఆశతో ఎదురు చూస్తున్నారు. పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటుపైనా ప్రకటన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు హోం మంత్రి రాక

మడకశిర: రాష్ట్ర హోంమంత్రి అనిత సోమవారం మడకశిర నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు మడకశిరలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడతారు. 10.30 గంటలకు చీపులేటి వద్ద ఉన్న ఇండియన్ డిజైన్స్ గార్మెంట్స్‌ను సందర్శిస్తారు. 11 గంటలకు గుడిబండలో పర్యటిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు మడకశిర పోలీస్ స్టేషన్‌ను సందర్శిస్తారు. 4.45 గంటలకు వైఎస్సార్ సర్కిల్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. హోం మంత్రి పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ నరసింగప్ప ఆదివారం తెలిపారు.

క్లుప్తంగా

విజయవాడకు తరలిన త్రివర్ణ పతాకం



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

రొద్దం: మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త దొంతి లక్ష్మీనారాయణగుప్త (లోకేష్) స్వయంగా రూపొందించిన 3,600 అడుగుల పొడవైన త్రివర్ణ పతాకం ఆదివారం విజయవాడకు తరలివెళ్లింది. సోమవారం విజయవాడలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఈ పతాకాన్ని ప్రదర్శించనున్నట్లు లక్ష్మీనారాయణగుప్త తెలిపారు. యువతలో సేవా భావం, నైతికత, దేశభక్తి పెంపొందించాలన్న ఉద్దేశంతో అతి పెద్ద త్రివర్ణ పతాకాన్ని తయారు చేసినట్లు వివరించారు. అలాగే మంగళవారం ఒంగోలులో వేలాది మంది విద్యార్థులతో ఈ పతాకాన్ని ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. అతి పెద్ద త్రివర్ణ పతాకాన్ని రూపొందించేందుకు సహకరించిన సహారా రేడియన్స్ సభ్యులను ఈ సందర్భంగా మంత్రి సవిత అభినందించారు. రొద్దం నుంచి విజయవాడకు త్రివర్ణ పతాకాన్ని తరలిస్తున్న ప్రత్యేక వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

జిల్లా ఫుట్‌బాల్ ప్రాబబుల్స్ జట్ల ఎంపిక



ఎంపికైన ఫుట్‌బాల్ క్రీడాకారులు

హిందూపురం టౌన్: జిల్లా ఫుట్‌బాల్ సీనియర్ పురుషుల, మహిళల జట్లను ఆదివారం ఎంపిక చేశారు. పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో చేపట్టిన ఈ ఎంపికను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. మొత్తం 25 మంది ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశామని, శిక్షణ అనంతరం ప్రతిభ చూపిన వారిని ప్రధాన జట్లకు ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ సీనియర్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సలీం, ట్రెజరర్ శేఖర్, ఈసీ మెంబర్ విజయవాణి, ఆజాద్, ఫుట్‌బాల్ కోచ్‌లు బాలాజీ, చైతన్య పాల్గొన్నారు.

చెప్పుకోలేని మోసం!

పుట్టపర్తిలో ఆర్థిక నేరాలు పెరిగిపోతున్నాయి. వివిధ దేశాల నుంచి వస్తున్న భక్తుల అవసరాలను ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు చెలరేగిపోతున్నారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి ఎలాంటి అనుమతులు లేకుండా విదేశీ కరెన్సీ మార్పిడికి ఊతమిస్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు తెరలేపారు.



- పుట్టపర్తిలో విచ్చలవిడిగా విదేశీ కరెన్సీ మారకం
- కమీషన్ల కక్కుర్తితో ఇబ్బడిముబ్బడిగా వెలసిన అనధికారిక కేంద్రాలు
- విదేశీ నకిలీ కరెన్సీతో బురిడీ కొట్టిస్తున్న కొందరు కేటుగాళ్లు
- చిన్నపాటి పొరపాటుతో రూ.లక్షల్లో నష్టపోతున్న వైనం
- పోలీసులకు చెబితే కేసుల్లో ఇరుక్కుంటామని బాధితుల మౌనం

సాక్షి, పుట్టపర్తి: ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న పుట్టపర్తికి రోజూ వివిధ దేశాల నుంచి భక్తులు వస్తుంటారు. కేవలం విదేశీయుల కోసమే నిర్వహిస్తున్న వ్యాపార కేంద్రాలు పుట్టపర్తిలో మాత్రమే కనిపిస్తాయి. వారి అభిరుచులకు అనుగుణంగా వంటకాలు, దుస్తులు, ఫోన్లు, కరెన్సీ మారకం తదితర దుకాణాలు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. ఈ క్రమంలో భక్తులు - వ్యాపారుల మధ్య బంధాన్ని చెడగొట్టే దిశగా కొందరు కేటుగాళ్లు ఆర్థిక మోసాలకు పాల్పడుతూ పుట్టపర్తి ప్రతిష్టను దిగజారుస్తున్నారు.

మచ్చుకు కొన్ని..

- రూ.10 వేల దేశీయ కరెన్సీ కోసం రూ.300 కమీషన్ తీసుకుంటారు. స్వదేశీ నుంచి విదేశీ కరెన్సీ కోసమైతే రూ.500 వసూలు చేస్తున్నారు. ఇక కమీషన్ల ఆశతో ఫోన్ పే ద్వారా నగదు బదలాయింపులకు రూ.200 తీసుకుంటున్నారు. ఇలాంటి దుకాణాలు ఒకటి.. రెండుకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. మిగిలిన దుకాణాల్లో గుట్టు చప్పుడు కాకుండా విదేశీ కరెన్సీ విచ్చలవిడిగా మార్పిడి చేస్తున్నారు. ఫలితంగా కరెన్సీలో అసలు ఏదో.. నకిలీ ఏదో కనుక్కునే పరిస్థితి లేక మోసపోతున్నారు. కానీ కేటుగాళ్ల గురించి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయలేని పరిస్థితి. ఇలాంటి ఘటనలు పుట్టపర్తిలో ప్రతి నెలా ఒకట్రెండు వెలుగులోకి వస్తున్నాయి.
- పుట్టపర్తిలోని సాయి టవర్స్ హోటల్ సమీపంలో ఉన్న ఓ మొబైల్ సర్వీసింగ్ సెంటర్‌లో విదేశీ నోట్ల మార్పిడి కొన్నేళ్లుగా గుట్టుగా జరుగుతోంది. ఈ విషయాన్ని పసిగట్టిన కేటుగాళ్లు అధిక కమీషన్ ఆశ చూపి నిర్వాహకుడికి రూ.60 లక్షల మేర టోకరా వేశారు. ఇచ్చిన విదేశీ నోట్లు నకిలీవని తేలడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే లేనిపోని కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని భయం.
- పుట్టపర్తిలోని బస్టాండు సమీపంలో చిత్రావతి రోడ్డులో ఓ దుకాణంలో విదేశీ నోట్ల మార్పిడి భారీ స్థాయిలో జరుగుతోంది. ఈ క్రమంలో దుకాణ నిర్వాహకుడి అత్యాశను గమనించిన కేటుగాళ్లు.. నకిలీ నోట్లతో బురిడీ కొట్టించారు. ఒకే రోజు రూ.6 లక్షలు తేడా రావడంతో బాధితుడు లబోదిబోమంటున్నాడు. నోట్లు ఇచ్చి వెళ్లిన సమయంలో లెక్క పెట్టుకోలేదు. ఆ తర్వాత ఇంటికెళ్లి చూస్తే వ్యత్యాసం ఉన్నట్లు గమనించి మిన్నకుండిపోయాడు.

అక్రమ దందాతో మోసం..

విదేశీ కరెన్సీ మార్పిడికి సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాల్సి ఉంది. అయితే పుట్టపర్తిలో ఒకట్రెండు కేంద్రాలకు అనుమతులు ఉండగా... సింహభాగం కేంద్రాలకు ఎలాంటి అనుమతులు లేవని తెలుస్తోంది. ఇలాంటి కేంద్రాల్లోనే నల్లధనం భారీగా మార్పిడి జరుగుతోంది. బాబా మందిరం చుట్టుపక్కల విదేశీ కరెన్సీ మార్పిడి లావాదేవీలు పెద్ద ఎత్తున సాగుతుంటాయి. అయితే ఆర్‌బీఐ నుంచి ఎలాంటి అనుమతులు లేని వారు కమీషన్ల కోసం కక్కుర్తి పడి విదేశీ ద్రవ్యం మారకానికి సిద్ధపడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు కేటుగాళ్లు విదేశీ నకిలీ కరెన్సీతో మోసాలకు తెగబడుతున్నారు. తాము చేస్తున్నది ఆర్థిక నేరం కాబట్టి నిర్వాహకులు సైతం ముందుగా గుట్టుగా విదేశీ కరెన్సీ తీసుకుని... ఆ తర్వాత తీరికగా లెక్కించే సమయంలో మోసం బట్టబయలై లబోదిబో మంటున్నారు. చివరకు తాము మోసపోయినట్లు తెలిసినా.. బయటికి చెప్పుకోలేని పరిస్థితి.

కమీషన్ల మాయ..

పుట్టపర్తి కేంద్రంగా ఫారిన్ కరెన్సీ ఎక్స్ఛేంజి కేంద్రాలు ఉన్నాయి. అధికారికంగా నిర్వహిస్తున్న ఈ కేంద్రాల్లో రూ.10 వేలకు రూ.200 చొప్పున కమీషన్ తీసుకుంటారు. అలాగే ఇతర దుకాణాల్లోనూ ఫోన్ పే ద్వారా లావాదేవీలు నిర్వర్తించడం, విదేశీ కరెన్సీ బదలాయింపులు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దుస్తుల దుకాణలు, ట్రావెల్స్, మొబైల్ సర్వీసింగ్, విగ్రహాల అమ్మకాలు తదితర షాపుల్లోనూ విదేశీ కరెన్సీ మారకం విచ్చలవిడిగా సాగుతోంది. అనధికారికంగా సాగే ఈ లావాదేవీల్లో కమీషన్లను భారీగా తీసుకుంటున్నట్లు సమాచారం. ఎన్ని రూ.లక్షలైనా సరే ఒక రోజులోనే మార్పిడి చేసి ఇస్తున్నారు. ఇదే కేటుగాళ్లకు ఊతమిచ్చింది. రూ.10 వేల నగదు మార్పిడికి రూ.500 వరకు కమీషన్ ఇస్తామని నమ్మబలికి విదేశీ నకిలీ కరెన్సీ అంటగట్టి దేశీయ కరెన్సీతో ఉడాయిస్తున్నారు.

ఏమీ చేయలేని స్థితిలో..

విదేశీ కరెన్సీ అనధికారిక మార్పిడి నేరం కావడంతో కేటుగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు ఏమీ చేయలేని స్థితిలో ఉండిపోతున్నారు. మోసాన్ని బయటకూ చెప్పుకోలేక సతమతమవుతున్నారు. ఓ బ్యాగ్ నిండా విదేశీ కరెన్సీ కట్టలతో వచ్చిన వ్యక్తి... నగదు బదలాయింపులు కాగానే పోలీసులు వస్తున్నారంటూ బెంబేలెత్తించి లెక్కించుకునేందుకు కూడా సమయం ఇవ్వకుండా ఉడాయించేస్తున్నారు. తీరా ఇంటికెళ్లిన తర్వాత చూస్తే.. అందులో సగానికి పైగా ఖాళీ పేపర్లు దర్శనమిస్తుండడంతో మోసపోయామని తెలుసుకుని మిన్నకుండిపోతున్నారు. ఇలాంటి ఘటనలో ఇటీవల పదుల సంఖ్యలో వెలుగులోకి వచ్చాయి.

నల్లధనాన్ని మార్చుకునేందుకు..

నల్లధనాన్ని తెల్లధనంగా మార్చేందుకు చాలామంది విదేశీ కరెన్సీ మార్పిడి బాట పట్టినట్లు తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా బ్లాక్ మనీ ఇచ్చి.. విదేశీ కరెన్సీ తీసుకుని ఇంట్లో దాచుకోవడం పరిపాటిగా మారుతోంది. భవిష్యత్తులో ఎప్పుడైనా విదేశాలకు వెళ్లినా.. బంధువులు వెళ్లినా పనికి వస్తాయనే క్రమంలో విదేశీ కరెన్సీని దాచి పెడుతున్నట్లు సమాచారం.

మూల్యం చెల్లించుకోక తప్పదు..



సాక్షి, పుట్టపర్తి: ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ కూటమి ప్రభుత్వ అరాచకాలకు పరాకాష్ట అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. మద్యం కుంబకోణం జరగకపోయినా పథకం ప్రకారమే అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో మద్యం పాలసీలో ఎలాంటి లోపాలు లేకున్నా.. ఏదో కుంభకోణం జరిగిందంటూ ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తూ, వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసు బనాయిస్తున్నారని మండిపడ్డారు. మిథున్‌రెడ్డి ఎలాంటి తప్పూ చేయలేదని, న్యాయమే గెలుస్తుందని అన్నారు.

అరెస్ట్ హేయం



ధర్మవరం: ఎంపీ మిథున్ రెడ్డి కూటమి ప్రభుత్వ హేయమైన చర్యలకు పరాకాష్ట అని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో మద్యం విధానం పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో అత్యంత పారదర్శకంగా నడిచిందన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రమవడంతో డైవర్షన్ చేసేందుకే సీఎం చంద్రబాబు లిక్కర్ స్కాం అంటూ లేని కేసు సృష్టించారన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో చూసినా టీడీపీ నాయకులే లిక్కర్ సిండికేట్‌గా మారి ప్రజల సొమ్మును కొల్లగొట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కూటమి నాయకులు చేస్తున్న తప్పులకు రాబోవు రోజుల్లో తగిన శిక్ష తప్పదని హెచ్చరించారు.

అక్రమం.. అన్యాయం



మడకశిర: ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అక్రమం, అన్యాయమని మడకశిర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జరగని లిక్కర్ స్కాంలో మిథున్‌రెడ్డిని ఇరికించారని ధ్వజమెత్తారు. లేని లిక్కర్ స్కాంను సృష్టించి కావాలనే మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని, కడిగిన ముత్యంలా ఆయన బయటకు రావడం ఖాయమని అన్నారు. అక్రమ అరెస్ట్‌లకు భయపడేది లేదన్నారు. కూటమి ప్రభుత్వ రెడ్‌బుక్ రాజ్యాంగంపై ప్రజలే తిరగబడే రోజులు దగ్గరల్లోనే ఉన్నాయన్నారు. అక్రమ కేసులు పెట్టడాన్ని మానుకోకపోతే ప్రజలు ఎదురు తిరిగే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

వేధింపులకు పరాకాష్ట



పుట్టపర్తి: లేని లిక్కర్ కేసును సృష్టించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అక్రమమని పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధరరెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్ రాజకీయకక్షతో వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్ని అరెస్టులు చేసినా వైఎస్ జగన్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గదన్నారు. మిథున్ రెడ్డిని వెంటనే విడుదల చేసి, ఆయనపై బనాయించిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

దుర్మార్గమైన చర్య



కదిరి టౌన్: ఎంపీ మిథున్ రెడ్డిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే అక్రమంగా అరెస్ట్ చేశారని కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంపై చంద్రబాబుకు ఎప్పటి నుంచో కోపం ఉందని, చదువుకునే రోజుల్లో చెంపపై కొట్టారని ఇప్పుడు కక్ష తీర్చుకుంటున్నారని మండిపడ్డారు. ఈవీఎంలను అడ్డుపెట్టుకుని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు... నాడు ప్రజలకిచ్చిన హామీలను గాలికి వదిలేశారని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలు నిలదీస్తుండడంతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారన్నారు. న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని, మరెన్నీ అక్రమ కేసులు పెట్టినా కడిగిన ముత్యంలా మిథున్‌రెడ్డి బయటకు వస్తారని పేర్కొన్నారు.

తండ్రిపై కుమారుడి దాడి

ధర్మవరం అర్బన్: తల్లితో గొడవపడుతున్న తండ్రిపై కుమారుడు కట్టెతో దాడి చేసిన ఘటన ధర్మవరంలో వెలుగు చూసింది. పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలలో నివాసముంటున్న ఏటూరి మహేష్ శనివారం భార్య మహాలక్ష్మితో గొడవ పడుతుండగా కుమారుడు సతీష్ కట్టెతో దాడి చేశాడు. గాయపడిన మహేష్‌ను బంధువులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అక్రమ అరెస్టులకు భయపడం

- ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై పెల్లుబుకిన నిరసనలు
- రెడ్‌బుక్ రాజ్యాంగం నశించాలంటూ నినాదాలు



ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా లేపాక్షిలో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లేపాక్షి: రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అక్రమ అరెస్ట్‌లకు భయపడబోమని వైఎస్సార్‌సీపీ నాయకులు స్పష్టం చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తూ హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో ఆదివారం లేపాక్షిలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం నశించాలంటూ నినాదాలు చేశారు. 13 నెలల కూటమి పాలన వైఫల్యాలపై ప్రజలను చైతన్య పరుస్తున్నామనే అక్కసుతోనే అక్రమ అరెస్ట్‌లకు ప్రభుత్వం తెరతీశారని ధ్వజమెత్తారు. చంద్రబాబు నిరంకుశ పాలనను ఎండగట్టారు.

అక్రమ మద్యంపై నిఘా ఉంచండి

- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



కొడికొండ ఎక్సైజ్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

చిలమత్తూరు: సరిహద్దుల్లో అక్రమ మద్యం రవాణాపై నిఘా ఉంచాలని సంబంధిత అధికారులను ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. 44వ జాతీయ రహదారిపై కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఉన్న ఎక్సైజ్ చెక్‌పోస్ట్‌ను ఆదివారం మంత్రి తనిఖీ చేసి, మాట్లాడారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణపై నిఘా ఉంచాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరు బాగుండేలా చూడాలన్నారు. వాహనాల తనిఖీల్లో మానవ తప్పిదాలు లేకుండా యంత్ర పరికరాలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఓఎస్డీ గోపాల్, అనంతపురం ఎక్సైజ్‌శాఖ ఉప కమిషనర్ నాగమద్దయ్య, సూపరింటెండెంట్ నరసింహులు, సీఐ శ్రీధర్, ఎస్ఐ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

కనగానపల్లిలో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి పర్యటన

కనగానపల్లి: రాష్ట్ర గనులు, భూగర్భ ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం కనగానపల్లిలో పర్యటించారు. ఎంపీ పార్థసారథి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలసి 'సుపరి పాలన- తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక బీసీ కాలనీలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎంలో ఉద్యోగ భద్రత కల్పించండి



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ ఎన్‌హెచ్‌ఎం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు దయానిధి డిమాండ్ చేశారు. ఆదివారం ప్రశాంతి గ్రామం వద్ద ఉన్న సీపీఎం కార్యాలయంలో ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో దయానిధితో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, జనరల్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, స్టాఫ్‌నర్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీషా, జిల్లా అధ్యక్షురాలు తులసి, అబీబ్ బాషా తదితరులు మాట్లాడారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఎంటీఎస్ అమలు చేయాలని, ఒకే క్యాడర్‌కు ఒకే వేతనం చెల్లించాలని, అర్హులైన వారిని రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, గతంలో జేఏసీ రాష్ట్ర కమిటీ చర్చించిన అంశాల ప్రకారం ప్రారంభ తేదీల నుంచి అరియర్స్, ఇంక్రిమెంట్లు, తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ జిల్లా అధ్యక్షుడిగా అబీబ్‌బాషా, జనరల్ సెక్రటరీగా తులసి, ఉపాధ్యక్షులుగా రహమత్‌బాషా, సభ్యులుగా ఆంజనేయులు, లోకేష్, మురళిని ఎన్నుకున్నారు.

యువకుడి ఆత్మహత్య

గార్లదిన్నె: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన రమేష్ నాయుడు(30), అనంతపురం నగర శివారులోని శిల్పాలేపాక్షి నగర్‌లో నివాసముంటున్న మానస ప్రేమించుకుని, గత నెల 7న పెద్దపప్పూరు మండలం అశ్వత్థ క్షేత్రంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. 20రోజులు సజావుగా జరిగిన సంసార జీవితంలో అనంతరం కలహాలు మొదలయ్యాయి. దీంతో ఈ నెల 6న భర్తతో గొడవ పడి మానస పుట్టింటికి వెళ్లి పోయింది. అప్పటి నుంచి దిగాలుగా ఉన్న రమేష్ నాయుడు.. ఆదివారం ద్విచక్ర వాహనంపై గార్లదిన్నె మండలం తిమ్మంపేట వద్దకు చేరుకుని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ముస్లిం లెజెండ్స్ పాత్ర ప్రముఖమైనది

- సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌గౌడ్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల్ గౌడ్, గజల్ శ్రీనివాస్, రచయిత ఉమర్ ఫరూక్ తదితరులు

హిందూపురం: భారత దేశ చరిత్రలో ముస్లిం లెజెండ్స్ పాత్ర ప్రముఖమైనదని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల్‌గౌడ్ అన్నారు. రాజుల పాలన నుంచి స్వాతంత్ర్య ఉద్యమం వరకు ఎంతో మంది ముస్లిం ప్రముఖులు ఉన్నారని, వారి గురించి భావి పౌరులకు తెలియాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హిందూపురంలోని సెవెన్ స్టార్ ఫంక్షన్ హాలులో సామాజిక సేవకుడు, కవి, రచయిత కల్లూరు ఉమర్ ఫారూక్ ఖాన్ సంకలనం చేసిన 'భారతీయ ముస్లిం లెజెండ్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమం భారతీయ తెలుగు సాహిత్య అకాడమీ, జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జాబిలి చాంద్ బాషా అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ న్యాయమూర్తితో పాటు ఆంధ్రప్రభ ఎడిటర్ శర్మ, విశిష్ట అతిథిగా గజల్ శ్రీనివాస్ హాజరయ్యారు. తొలి ప్రతిని స్వాతంత్ర్య సమరయోధుడు మెళవాయి గోవిందరెడ్డికి అందజేశారు. జస్టిస్ గోపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. సాతంత్ర్య పోరాట యోధులు, ముస్లిం సామాజిక కార్యకర్తలు, రచయితలు, సాహితీకారులు అందరి జీవిత విశేషాలను రచయిత దశాబ్ద కాలం పాటు శ్రమించి ముస్లిం లెజెండ్స్‌ను పుస్తక రూపంలో తీసుకొచ్చారని ప్రశంసించారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం గురించి చాలా చక్కగా వివరించిన ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలన్నారు. అనంతరం 50 మంది సామాజిక సేవకులు, 50 మంది సాహితీ వేత్తలకు సాహితీ సామాజిక సేవ పురస్కారాలు అందజేశారు. నవ్యాంధ్ర రచయితల సంఘ అధ్యక్షులు బిక్కి కృష్ణ, జల్లి విద్యాధర్‌రావు, ఐఆర్ఎస్ డాక్టర్ ఉమర్ అలీషా సయ్యద్ అహ్మద్, అనంత రాముడు, మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం



రఘునాథరెడ్డి, సావిత్రమ్మ (ఫైల్)

శింగనమల: సొంతూరిలో బంధువులు అనారోగ్యంతో ఉంటే పరామర్శించడానికి భార్యాభర్త తాడిపత్రి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. అయితే.. మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. భర్త సంఘటన స్థలంలోనే మృతి చెందగా.. భార్యను 108 వాహనంలో ఆస్పత్రికి తీసుకెళుతుండగా కన్నుమూసింది. ఈ విషాదకర ఘటన ఆదివారం శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ విజయకుమార్ తెలిపిన మేరకు... శింగనమల మండలం గుమ్మేపల్లికి చెందిన రఘునాథరెడ్డి (61), సావిత్రమ్మ (59) దంపతులు దాదాపు 19 ఏళ్ల క్రితం తాడిపత్రికి వలస వెళ్లారు. అక్కడే వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఒకరికి వివాహం కాగా, మరొకరికి ఇంకా కాలేదు. వీరికి సొంతూరు గుమ్మేపల్లిలో భూములు, ఇల్లు ఉన్నాయి. సొంతూరిలో బంధువులు అనారోగ్యంతో ఉండడంతో పరామర్శించడానికి భార్యాభర్త ఆదివారం కొత్తగా కొన్న ద్విచక్రవాహనంపై తాడిపత్రి నుంచి బయలుదేరారు. మార్గమధ్యంలో శివపురం పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. కొద్ది దూరంలోని శింగనమల మరువకొమ్మ క్రాస్ వద్దకు చేరుకుని..కొత్తగా నిర్మించిన 554-డీ రోడ్డులో శింగనమల వైపు క్రాస్ అవుతుండగా వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రఘునాథరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని కాలు పూర్తిగా తెగిపోయింది. తీవ్ర గాయాలపాలైన సావిత్రమ్మను 108 వాహనంలో చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలిస్తుండగా.. మార్గ మధ్యంలో మృతి చెందింది. దంపతుల మృతితో ఇటు గుమ్మేపల్లి, అటు తాడిపత్రిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆదివారం సాయంత్రం గుమ్మేపల్లిలో దంపతుల అంత్యక్రియలు నిర్వహించారు. భార్యాభర్త ఎంతో మంచి వారని, గ్రామానికి వచ్చినప్పుడు అందరినీ ఆప్యాయంగా పలకరించే వారని స్థానికులు గుర్తు చేసుకుని కన్నీటి పర్యంతమయ్యారు.

అండర్ బ్రిడ్జి లేకపోవడంతోనే ...

అనంతపురం-తాడిపత్రి మార్గంలో జాతీయ రహదారి 554-డీ నిర్మాణంలో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన శింగనమలకు అండర్ వే బ్రిడ్జి నిర్మించలేదు. దీంతో తాడిపత్రి నుంచి వచ్చే వారు శింగనమలలోకి రావాలంటే రోడ్డు క్రాస్ చేయాలి. శింగనమల నుంచి అనంతపురానికి వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. దీంతో మరువకొమ్మ క్రాస్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నా.. అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.